తాగునీరు కలుషితం

- జనావాసాల మధ్య పెట్రోల్ బంక్
- ఇళ్ల బోర్ల నుంచి పెట్రోల్ వాసనతో నీరు
- తాగేదెలా.. వాడేదెలా..? అని స్థానికుల గగ్గోలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


సంఘం ఆఫీస్ కూడలిలో పెట్రోల్ బంక్ వద్ద అధికారులను నిలదీస్తున్న స్థానికులు(ఫైల్)

సీతంపేట: భూగర్భ జలాలు కలుషితమై బోర్ల నుంచి వచ్చే నీరు పెట్రోల్ వాసనతో తాగడానికి, వాడకానికి పనికిరాక జనం ఆరు నెలలుగా ఇబ్బంది పడుతున్నా.. అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్టు కూడా లేదు. జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని సంఘం ఆఫీస్ కూడలి వద్ద ఉన్న భారత్ పెట్రోల్ బంక్ చుట్టుపక్కల ఇళ్లల్లో బోరుబావులు కలుషితమయ్యాయని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. లలితానగర్, దాలిరాజు సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో ఆరు నెలలుగా నీరు పెట్రోల్ వాసన వస్తోందని, ఆయిల్ జిడ్డు, నల్లటి తెట్టు వస్తోందని నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో మోటారు వేసినా, కుళాయి ట్యాప్ తిప్పినా.. పెట్రోల్ వాసనతో కడుపు తిప్పేస్తోందని, నీరు వాసన చూస్తే ఘాటైన పెట్రోల్ వాసన భరించలేకపోతున్నామని స్థానిక మహిళలు వాపోతున్నారు.


నీరు కలుషితమైన అక్కయ్యపాలెంలోని లలితానగర్

ఆరు నెలలుగా ఇబ్బంది..

బీపీసీఎల్ బంకులో భూగర్భంలో ఉన్న పెట్రోల్ ట్యాంకులు లీకు అవ్వడం వల్లే ఈ ప్రాంతంలో సుమారు 80 నుంచి 100 ఇళ్లల్లో బోర్ల నుంచి వస్తున్న నీరు పెట్రోల్ వాసన వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పదేళ్ల కిందట నివాసాల మధ్య పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తున్నప్పుడే వ్యతిరేకించామని, అయినా మాకు నోటీసులు ఇచ్చి బంకు ఏర్పాటు చేశారని మండిపడుతున్నారు. ఇపుడు నీరు వాడుకకు పనికిరాక, సొంతిళ్లు వదిలి వెళ్లలేక ఆరు నెలలుగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్రోల్ వాసనని పరీక్షలో వెల్లడి


పెట్రోల్ వాసన వస్తున్నట్టు ల్యాబ్ ఇచ్చిన రిపోర్ట్

ఇళ్లల్లో నీరు పెట్రోల్ వాసన రావడానికి కారణం మీ బంకు వల్లేనని స్థానిక మహిళలు పెట్రోల్ బంకు నిర్వాహకులను ప్రశ్నించారు. మా బంకులో ఎటువంటి సమస్య లేదని, రోడ్డు విస్తరణ కోసం డ్రెయిన్లు తవ్వడం వల్ల నీరు కలుషితమై ఉంటుందని, మా బంకు వల్ల కాదని వారు తెగేసి చెప్పారు. దీంతో 15 ఇళ్లల్లో మంచి నీటి శాంపిల్స్‌ను ప్రభుత్వ రీజనల్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీకి పరీక్షకు పంపించారు. నీటిలో పెట్రోల్ వాసన వస్తోందని, తాగడానికి పనికిరాదని రిపోర్టు ఇచ్చారు. ఈ రిపోర్టులతో బంకు నిర్వాహకులను మరోసారి స్థానికులు నిలదీశారు.


పెట్రోల్ వాసన వస్తున్న తాగునీరు


నీరు కలుషితం కావడానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్న పెట్రోల్ బంక్

మీ బంకు వల్లే పెట్రోల్ వాసన వస్తోందని మండిపడ్డారు. నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో సమస్యను పరిష్కరించాలంటూ జేసీకి స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో సివిల్ సప్లై ఏఎస్‌వో ఇటీవల వచ్చి తనిఖీ నిర్వహించారు. బంకులో లీకులు లేవని నిర్ధారించారు. అయితే మా ఇళ్లల్లో నీరు ఎందుకు పెట్రోల్ వాసన వస్తున్నాయో చెప్పాలని అధికారులను స్థానికులు నిలదీయడంతో ఇళ్లల్లో నీటిని పరిశీలించారు. పెట్రోల్ వాసన వస్తోందని జేసీకి నివేదిస్తామని చెప్పి వెళ్లిపోయారు. సమస్య మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోజూ నీటిని కొంటున్నాం



పెట్రోల్ బంకు వద్ద చాలా కాలంగా అద్దెకు ఉంటున్నాం. ఆరు నెలలుగా బోరు నీరు పెట్రోల్ వాసన వస్తోంది. తాగడానికి, స్నానానికి, దుస్తులు ఉతకడానికి కూడా పనికిరావడం లేదు. మా బిల్డింగ్‌లో అన్ని ఫ్లాట్స్ కలిసి రోజూ వెయ్యి రూపాయలు పెట్టి వాటర్ ట్యాంక్ తెప్పిస్తున్నాం. ఇంటి అద్దెతోపాటు నీటి ఖర్చు భారంగా ఉంది. అధికారులు సమస్యను పరిష్కరించాలి.
– ఎస్.భాగ్యలక్ష్మి, లలితానగర్, అక్కయ్యపాలెం

స్కిన్ అలర్జీ వస్తోంది



బోరు నుంచి వచ్చే నీరు లెట్రిన్‌లో పొయ్యడానికి తప్ప ఎందుకూ పనికి రావడం లేదు. కాళ్లు చేతులు కడుక్కున్నా స్కిన్‌పై అలర్జీ వస్తోంది. పెట్రోల్ వాసనతో ఆరు నెలలుగా ఇబ్బంది పడుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. జేసీ గారు స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.
– కె.నవ్య, లలితానగర్

నివాసాల మధ్య బంక్ ఎలా..?



నివాసాల మధ్య పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ఎలా అనుమతి ఇచ్చారో తెలియడం లేదు. బంకు వల్లే ఇళ్లల్లో నీరు పాడైంది. ల్యాబ్ టెస్టింగ్ రిపోర్టులు కూడా ఉన్నాయి. అయినా బంకు యజమాని చాలా నిర్లక్ష్యంగా ఉన్నారు. ఉన్నతాధికరులు జోక్యం చేసుకుని మా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. లేదంటే ఇళ్లు ఖాళీ చేయడం తప్ప మరో మార్గం లేదు.
– ఎల్. వెంకటలక్ష్మి, లలితానగర్, అక్కయ్యపాలెం

7న ఆండాళ్ తిరునక్షత్ర మహోత్సవం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 7న ఆండాళ్ల తిరునక్షత్ర మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ మాసంలో గోదాదేవి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. ఉదయం 9 గంటలకు ఆండాల్ అమ్మవారి ఆలయ ప్రదక్షిణ, అనంతరం ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం ఉంటుందని చెప్పారు. తిరుప్పావై పారాయణం అనంతరం అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి జరుగుతాయన్నారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని ఈవో కోరారు.

రోడ్డు మూసివేసినా అడిగేదెవరు?


అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డుకు అడ్డంగా టేబుల్స్ వేసిన జనసేన నాయకులు

సీతంపేట: జనసేన నాయకులు అధికార దర్పం ప్రదర్శిస్తున్నారు. ఏం చేసినా మమ్మల్ని అడిగేవారు లేరన్న చందంగా వ్యవహరిస్తున్నారు. జనసేన పార్టీ 26వ వార్డు నాయకులు మహారాణి పార్లర్ కూడలి వద్ద చిన్నూరు రోడ్డులో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. 80 అడుగుల రహదారిలో ఒకవైపు రోడ్డును పూర్తిగా మూసివేసేలా టేబుల్స్ వేసి సభ్యత్వ నమోదు చేశారు. టేబుల్స్ ఒక పక్క వేసుకుని సభ్యత్వ నమోదు చేపట్టవచ్చు.. అలా కాదని రోడ్డును మూసివేసేలా టేబుల్స్ అడ్డంగా వేసుకుని కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు నుంచి చిన్నూరు, ఎన్జీజీవోస్ కాలనీకి వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అక్కడే ఉన్న ఫోర్త్‌టౌన్ పోలీసులు కూడా చూసీచూడనట్టు వ్యవహరించడం పలు విమర్శలకు తావిచ్చింది.

క్లుప్తంగా

శ్రావణ మాస పూజలు ప్రారంభం


పూజలందుకున్న దుర్గమ్మవారు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో సోమవారం శ్రావణ మాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దుర్గమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమ పూజలు చేశారు. శ్రీ చక్రానికి అర్చకుడు రాజా స్వామి పూజలు చేసి మాట్లాడారు. నెల రోజుల పాటు దుర్గాదేవికి కుంకుమ పూజలు చేస్తామన్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో అర్చకుడు వంశీ, ఆలయ సిబ్బంది వనజాక్షి, శివ, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీగాయకులు

సీతంపేట: స్వర మనోహరం సంగీత్ సంస్థ సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను అలరించింది. గాయనీ గాయకులు మనోహర్, దేవరాజ్, శివనారాయణ, హర్షప్రియ, కోమలి, విశ్వప్రసాద్, నాగేశ్వరరావు, అలేఖ్య, సావిత్రి, ఆది, జాస్మిన్, పూర్ణమాధురి, సత్య, అనుషా తదితరులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన హిట్ సాంగ్స్ పాడి ఆకట్టుకున్నారు.

సుదీర్ఘ సేవలకు సత్కారం


డాక్టర్ లక్ష్మీప్రభను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ, విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో 33 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించిన ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ కె.రాధాకృష్ణ, హోం సైన్స్ విభాగాధ్యక్షులు డాక్టర్ వై.లక్ష్మీప్రభను ఘనంగా సత్కరించారు. సోమవారం కళాశాలలో వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు సత్కరించి శుభకాంక్షలు తెలిపారు.

వీధిలైటు వెలిగించండి


శ్రీహర్షనగర్‌లో వెలగని వీధిలైటు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం శ్రీహర్షనగర్‌లో కొంతకాలంగా వీధిలైటు వెలగడం లేదు. ఈ సమస్యపై పత్రికల్లో వార్త వస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. శ్రీహర్షనగర్‌లో రాత్రి పూట చీకటిగా ఉండటంతో రాకపోకలు సాగించే పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో చీకటి పడ్డాక బయటకు వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఒక వీధిలైటు ఏర్పాటు చేయాలని స్థానిక వాసులు కోరుతున్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం


దొండపర్తి సచివాలయం-2 పరిధిలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ జయదేవి

సీతమ్మధార: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని దొండపర్తి యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శ్రావణి అన్నారు. దొండపర్తి సచివాలయం-2లోని ఆశీలమెట్ట అంగన్‌వాడీ కేంద్రం, అమర్‌నగర్, భగత్‌సింగ్ నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ సి.జయదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ నిర్వాహకులపై ఎంతో నమ్మకంతో కేంద్రాలకు పంపిస్తున్నారన్నారు. అక్కడ ఆటపాటలతో కూడిన విద్య అందించడంతోపాటు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. బిడ్డ పుట్టిన ఆరు నెలలు వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, దీనివల్ల బిడ్డకు మానసిక, శారీరక ఎదుగుదల, తెలివితేటలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజార్ వి.ఇందిరాదేవి, డీపీహెచ్‌ఎన్ మనోరమ, హెచ్.వి. అరుణకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


జైప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రమణకుమారి

తల్లిపాల శ్రేష్టతపై అవగాహన

కంచరపాలెం: గర్భిణీలు, బాలింతలు తల్లిపాల శ్రేష్టతపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీవో రమణకుమారి అన్నారు. 47వ వార్డు జైప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. నవజాత శిశువుల సరైన అభివృద్ధికి తల్లిపాలు శ్రేష్టమైనవన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఆరోగ్యంగా ఉండి బరువు ఎక్కువగా ఉన్న చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌పీ పేట పీహెచ్‌సీ వైద్యాధికారి శశిప్రియాంక, గౌతమి, మర్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జె.టి.ఎన్.జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

26 నుంచి రాజస్థాన్‌లో జాతీయ మీడియా సదస్సు

దాబాగార్డెన్స్: బ్రహ్మకుమారీస్ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. బ్రహ్మకుమారీస్ నేతృత్వంలో రాజస్థాన్ మౌంట్‌అబూలో నిర్వహించనున్న జాతీయ మీడియా సదస్సు పోస్టర్‌ను సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సును విశాఖ జర్నలిస్టులు విజయవంతం చేయాలని కోరారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 26 నుంచి 30 వరకు జరిగే ఈ సదస్సులో పాల్గొనే పాత్రికేయులు ఈనెల 12వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వచ్చేనెల 24న విశాఖలో మీడియా ప్రతినిధుల బృందం రైలులో రాజస్థాన్ బయలుదేరుతుందని చెప్పారు. వివరాలకు 85558 57990 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణరావు, బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు సిద్ధు, మురళీకృష్ణ, సునీత, నారాయణ, అనురాధ, సింహాచలం దేవస్థానం మాజీ ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

- కొండవాలులో రక్షణ చర్యలు చేపట్టాలి
- జోనల్ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం
- 47వ వార్డులో పర్యటన

కంచరపాలెం: కొండవాలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగు పరచాలని, కొండవాలు మెట్ల మార్గాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ, రాంజీ ఎస్టేట్, సంజీవయ్యా కాలనీ కొండవాలు ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. కాలువలో పూడికలు, ఫ్లోటింగ్ మెటీరియల్ అధికంగా వస్తున్నందున వాటిని ఎప్పటికప్పుడు అదుపు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల్లోని మెట్ల మార్గాల్లో రెయిలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నివాసాల్లోకి వర్షపు నీరు చేరుతున్నందన.. శాశ్వత పరిష్కారం కోసం రక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆయన ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో డయేరియా, అతిసార వ్యాధి, డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, దోమల వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్‌కు సూచించారు. వయసు పైబడిన పారిశుధ్య కార్మికులను కొండవాలు ప్రాంతాల నుంచి వేరొక చోటుకు మార్చివేసి సమర్థులైన కార్మికులను ఏర్పాటు చేయాలని జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-5 ఈఈలు, మత్స్యరాజు, తారా ప్రసన్నరెడ్డి, రెవెన్యూ అధికారి(ఆర్‌వో) బాబూరావు, ఏసీపీ వెంకటరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, పర్సనల్ బ్రాంచ్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయంలో గల పర్సనల్ బ్రాంచిలో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్, పర్సనల్ బ్రాంచ్ రిక్రియేషన్ క్లబ్ కన్వీనర్ రంజన్ మహంతి, క్లబ్ సెక్రటరీ ఎం.రమేష్ నేతృత్వంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. సమాజంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు అత్యవసరమైన రక్తదాన సేకరణలో భాగస్వాములవ్వడం సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 56 మంది ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ రక్తాన్ని సేకరించింది. కార్యక్రమంలో అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్స్ ఎ.వెంకటేశ్వరరావు, అప్పారావు, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ డీపీవో రంజన్, ఇతర ఉన్నతాధికారులు

కృష్ణా కళాశాలలో ఎన్‌సీసీ ఎంపిక ప్రక్రియ


ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ అధికారులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశానికి అవకాశం కల్పించారు. 13ఏ బెటాలియన్, ఎన్‌సీసీ అధికారులు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. 36 క్యాడెట్ల ఖాళీలను భర్తీ చేయనున్నామని కళాశాల ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు తెలిపారు. వీరిలో 24 మంది పురుషులు, 12 మంది మహిళలను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో 13ఏ బెటాలియన్‌కు చెందిన సుబేదార్ సుజాన్ సింగ్, పీఐ స్టాఫ్ ఆనంద్‌సింగ్, బసంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై రాంగ్ పార్కింగ్

- అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేతతో ఇబ్బందులు
- దృష్టి సారించని ట్రాఫిక్ పోలీసులు


గురుద్వారా రహదారిపై రాంగ్ పార్కింగ్‌లో వాహనాలు

సీతమ్మధార: రహదారులపై రాంగ్ పార్కింగ్ చేస్తున్న వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం పక్క రోడ్డులో ద్విచక్ర వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపి వేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు కష్టతరంగా మారింది. గురుద్వారా నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రోడ్డుపై రాంగ్ పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిపి ఉంచడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆదివారాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. కమర్షియల్ ప్రాంతం కావడంతో రోడ్డుకు అడ్డంగా ద్విచక్ర వాహనాలు, వ్యాన్‌లు, ఆటోలను పార్క్‌చేయడం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక్కడి హోటళ్లు, దుకాణాలకు వచ్చే వారంతా తమ కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. ట్రాఫిక్ పోలీసులు ఎన్నిమార్లు చెప్పినా.. షాపుల యజమానుల తీరు మారడం లేదు. ఈ సమస్యపై ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి చర్యలు చేట్టాలని పలువురు కోరుతున్నారు.


సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం పక్క రోడ్డులో ద్విచక్ర వాహనాల నిలిపివేత

స్వప్రయోజనాల కోసమే కులాల వర్గీకరణ

కంచరపాలెం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాలకు చట్టం చేయడం ద్వారా ఒక ప్రత్యేక కులాన్ని లేదా కులాలను విభజించడం, ఉప వర్గీకరణ చేయడం, తిరిగి వర్గీకరించడం, రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారు. రిజర్వేషన్ల ఉప వర్గీకరణ అధికారం రాష్ట్రాలకు ఇవ్వడం వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. ఉప వర్గీకరణల పేరుతో అట్టడుగునున్న దళితులకు న్యాయం జరగదన్నారు. సమాజంలో బలహీన వర్గాలకు సహాయం చేయడానికి అని చెప్పి రాష్ట్రాలు రిజర్వేషన్లు ఇచ్చేటప్పుడు వారి స్వార్థ లాభాల కోసం మాత్రమే వినియోగిస్తారని ఆరోపించారు. వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా సుప్రీం కోర్టు ధర్మాసనాన్ని దళిత సేన ఆశ్రయిస్తుందని అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చా కామేశ్వరరావు, కన్వీనర్ గొల్లమాల మీనా, కార్యదర్శి పట్నాల రూనీ్స, సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు

డీఎస్సీ, టెట్‌పై అవగాహన సదస్సు రేపు

దాబాగార్డెన్స్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో డీఎస్సీ, టెట్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు కో ఆర్డినేటర్ పి.సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు నిష్ణాతులు పరీక్షలపై అవగాహన కల్పించనున్నారన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి 160 పేజీల విద్యా మనో విజ్ఞాన శాస్త్ర మెటీరియల్‌ను ఉచితంగా అందజేయనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు 93472 05549కు ఫోన్ చేసి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల సేవలో ప్రేమ సమాజం


ఆశ్రయులకు వస్త్రాలు అందిస్తున్న డాక్టర్ దిలీప్‌కుమార్, ప్రేమ సమాజం కమిటీ సభ్యులు

దాబాగార్డెన్స్: ప్రేమ సమాజం కుష్టు శరణాలయం 70వ వార్షికోత్సవం సోమవారం ప్రేమ సమాజంలోని న్యూ మీటింగ్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎండోక్రైనాలజిస్ట్ వైద్య నిపుణుడు డాక్టర్ దిలీప్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ప్రేమ సమాజం చేపడుతున్న సేవలన్నింటి కన్నా కుష్టు రోగులకు ఆశ్రయం కల్పించి సేవలందించే కార్యక్రమం మహోన్నతమైందన్నారు. సంస్థ అధ్యక్షుడు బుద్ధా శివాజీ మాట్లాడుతూ ప్రేమ సమాజం 1955 నుంచి కుష్టు వ్యాధితో బాధపడుతున్న అనేక మందిని అక్కున చేర్చుకుని వారికి సపర్యాలు చేస్తూ, ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ మనోధైర్యం అందిస్తోందన్నారు. ఈ సంస్థలో వైద్య సేవలు పొందిన రోగులు తిరిగి మామూలు స్థితికి చేరుకుని, తమ ఇళ్లకు వెళ్లిపోగా, ప్రస్తుతం 13 మంది మాత్రమే ఉన్నారని చెప్పేందుకు ఎంతో గర్విస్తున్నామన్నారు. అనంతరం కుష్టు శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి నూతన వస్త్రాలు అందజేశారు.